క్లుప్తంగా

ప్రశాంతంగా సైన్స్ పరీక్ష


పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పాలసముద్రం : మండల పరిధిలో పాలసముద్రం ఉన్నత పాఠశాలలో జరుగుతుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు డిపార్టుమెంట్ ఆఫీసర్ యువరాజ్ తెలిపారు. శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్ష అత్యంత భద్రత నడుమ జరిగింది. పరీక్షకు 166 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎస్ఐ భారతి పరీక్ష కేంద్రాల వద్ద తమ సిబ్బందితో గట్టి బందోబస్తు ఇచ్చారు.

చెత్త నుంచి సంపద తయారీపై శ్రద్ధ పెట్టాలి


చెత్త నుంచి సంపద కేంద్రంలోని ఎరువుల తొట్టెను పరిశీలిస్తున్న జేమ్స్, ధరణి

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీపై గ్రీన్ అంబాసిడర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎఫ్‌టీసీ జేమ్స్, పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. శనివారం పాలసముద్రం చెత్త సేకరణ కేంద్రాన్ని వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, వానపాములు వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల ప్రకారం విక్రయించాలని తెలిపారు. అనంతరం తొట్టెలో ఉన్న ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: విజయవాడ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సంస్థ (శాప్) ఆదేశాల మేరకు సమ్మర్ క్యాంపుల నిర్వహణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో మే 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజులపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు 50 క్యాంపులతోపాటు ప్రతి క్యాంపులో 25 మంది బాలురు, 25 మంది బాలికలను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ఔత్సాహికులైన పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు, జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఈ నెల 31వ తేదీలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, తిరుపతి వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95420 34270, 98663 17312 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మత్తు పదార్థాల తరలింపు: ఇద్దరి అరెస్టు


ఆరుముగం, అరుల్

తిరుత్తణి: మత్తుపదార్థాలు తరలిస్తు న్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరుత్తణి సమీపంలోని పొన్పాడి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రాఖీకుమారి ఆధ్వర్యంలో పోలీసు లు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు వెళుతున్న బస్సులో తనిఖీ చేశారు. ప్రభుత్వం నిషేధించిన పొగాకు, గుట్కాను తరలిస్తున్నట్లు గుర్తించి, వాటి ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అ దుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. చిత్తూరు జిల్లా నగరి మండలం ఏకాంబరకుప్పానికి చెందిన ఆర్ముగం(29), చెన్నై మదురవాయిల్‌కు చెందిన అరుల్(49)గా గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.20 వేల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాఖీకుమారి తెలిపారు.

అధునాతన డిజిటల్ సేవలు అందించాలి

తిరుపతి సిటీ: గ్రంథాలయాలు అధునాతన డిజిటల్ సేవలను పౌరులకు అందించాలని భారతీదాసన్ వర్సిటీ గ్రంథాలయ శాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ శ్రీనివాస రాఘవన్ సూచించారు. గత ఐదురోజులుగా వర్సిటీలో జరుగుతున్న పౌర గ్రంథాలయ సిబ్బంది శిక్షణా కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను, గ్రంథాలయ ఆధునికత, ఆవశ్యకతపై సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. సాంకేతికత, డిజిటలైజేషన్ విధానంతో గ్రంథాలయాలు పౌరులకు సేవలు అందిస్తున్నాయని కొనియాడారు. అనంతరం శిక్షణ పొందిన పలు రాష్ట్రాలకు చెందిన గ్రంథాలయ సిబ్బందికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అళగప్ప యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.గణేషన్, పుదుచ్చేరి వర్సిటీ మాజీ డీన్ కె.రామయ్య, ఆచార్య పుల్లారెడ్డి, ఎంఆర్ చంద్రన్, దొరస్వామి, ఎ.కిషోర్, ఎస్వీయూ గ్రంథాలయ అధికారి ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు పాల్గొన్నారు.

మేలు చేశామనిపిస్తేనే ఆదరించండి

- సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించండి
- నవరత్నాలే ప్రజల జీవనాడి
- రాబంధులన్నీ ఒక్కటయ్యాయి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి
- మంగళ హారతులతో బ్రహ్మరథం పట్టిన ప్రజలు


మహిళలకు మంగళ హారుతులు ఇస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కటికపల్లి, వీవీ పురం, మంగుంట పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు, వృద్ధులు, ప్రజలు మంగళ హారతులు, పూలవర్షాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

రాబంధులన్నీ ఒక్కటయ్యాయి..

వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఓడించేందుకు రాబంధులన్నీ ఒకటయ్యారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలసి ఓటుకు రూ.10 వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్రజలకు సువర్ణ పాలన కావాలంటే జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. పేదవారు కూడా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగనన్న లక్ష్యం అని అన్నారు. ముఖ్యంగా మహిళ ఆర్థిక స్వావలంభనకు విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. మహిళల రక్షణకు దిశ చట్టంతో భరోసా కల్పించారని చెప్పారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగిద్దాం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని తెలిపారు. సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం జగనన్న తన ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటివరకు దాదాపు 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. పేదల ప్రగతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ జగన్ సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

నవరత్నాలతో లబ్ధి..

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ఒకప్పుడు ఏ పథకం కావాలన్నా అభివృద్ధి పనులు జరగాలన్నా, మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రతి సమస్య పరిష్కారం అవుతుండడంతో గ్రామస్తులు సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏఒక్క పథకంలో చూసినా అవినీతి ఉండేదని, ఇప్పుడు అమలు చేస్తున్న పథకాల్లో ఏ ఒక్క దాంట్లో కూడా ఇంత వరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, సర్పంచులు రూప, మార్కొండయ్య, లక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ గీతమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, నాయకులు జనార్దన్, దామునాయుడు, విజయాబాబు, సురేష్, ప్రసాద్‌రెడ్డి, మణి, డిసెంబర్‌శెట్టి, దాము ఆచారి, శేషాద్రి, అమావాసయ్య, మాధవ, చిన్ని రాజీవ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ చంద్రప్రసాద్‌కు మంత్రి రోజా పరామర్శ


రమేష్ చంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు రమేష్ చంద్రప్రసాద్‌ను మంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం నిండ్ర మండలం ఉరూరుపేటలోని స్వగృహానికి విచ్చేసిన ఆయనను శనివారం సాయంత్రం మంత్రి ఆర్కేరోజా కలిశారు. ఆయన ఆరోగ్యపరిస్థితిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా పలు అంశాలను మంత్రి ఆప్యాయంగా ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, పీఏసీఎస్ చైర్మన్ మునికృష్ణారెడ్డి, నాయకులు శ్యామ్‌లాల్, సర్పంచ్‌లు బాబురెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి మంత్రి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని మంగుంట దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త వెంకటేశులు (67) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి గ్రామానికి వెళ్లి వెంకటేశ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన మునస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆరోజు మంత్రి అందుబాటులో లేకపోవడంతో శనివారం ఆయన వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, సర్పంచ్ రూప, నాయకులు జనార్దన్, శేషాద్రి, యువరాజ్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం


తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

సమతుల ఆహారంతో మెరుగైన ఆరోగ్యం


నింద్ర: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

నగరి : నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సత్రవాడ వినాయకపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని సీడీపీఓ కృష్ణవేణి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తల్లులతో ఆమె మాట్లాడుతూ ప్రతి నిత్యం అందరూ సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ ప్రతిరోజు శుచి, శుభ్రత పాటిస్తూ మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గోపి, ఏఎస్ఎం సాక్కు, సుభాషిణి, ఆశావర్కర్లు శైలజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

నింద్ర: బాలింతలు, కిశోర బాలికలకు ప్రతినిత్యం విధిగా పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని నగరి సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. శనివారం మండల కేంద్రమైన నింద్ర అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిశోర బాలికలకు తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి

- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి


నగరి: అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

పుత్తూరు: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పుత్తూరు మున్సిపాలిటీ 4వ వార్డులో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నేటి ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న లక్ష్యంతో నేటి ప్రభుత్వం పని చేసిందని తెలిపారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు గుప్పించే చంద్రబాబునాయుడు, తర్వాత ప్రజలను మోసం చేయడమే ఆయన నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందించారని తెలిపారు. అలాగే పవర్‌లూమ్ కార్మికులకు విద్యుత్ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చారని చెప్పారు. ఇలా ఎన్నో విధాలుగా ప్రజలకు చేయూతనిస్తున్న ఈ సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జగనన్న కోసం జనసైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మను ముచ్చటగా మూడోసారి నగరి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, నాయకులు లారీమోహన్, మనోహర్‌రెడ్డి, మాహీన్, ఏకాంబరం, పవన్, గోపి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చిరంజీవి, మురళి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం


పుత్తూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను అభ్యర్థిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు.. ప్రజల గెలుపు కావాలని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తెరణి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులతో కలిసి మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలపై అవగాహన కల్పించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్కే రోజాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజల పక్షాన నిలబడిన వైఎస్సార్‌సీపీని గెలిస్తే ప్రజలంతా గెలిచినట్లే అన్నారు. సంక్షేమం, అభివృద్ధి అంది జరిగింటేనే ఓటెయ్యండని చెప్పే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది జగనన్న మాత్రమే అన్నారు. ఎన్నికల సమయంలో పలు ఆకర్షణలు చూపుతూ మభ్యపెట్టేందుకు అన్ని పార్టీలు కూటమిగా వస్తున్నాయని హెచ్చరికగా ఉండాలన్నారు. కాస్త ప్రలోభపడినా మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కున్నట్లన్నారు. తాము చేసిన అభివృద్ధిని వాస్తవరూపంలో మీ ముందు ఉంచుతున్నామని అభివృద్ధిని చూపే కరపత్రాలను ప్రతి ఇంటికీ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీ, సచివాలయ కన్వీనర్ హరి, ఎంపీటీసీ ప్రదీప్, సర్పంచ్‌లు నిర్మలాడింపుల్, ప్రకాష్, పరంధామన్, రవి నాయకులు భాస్కర్ రెడ్డి, మోహన్, పళని, రవి, గోపి, దామునాయుడు, జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి అవసరం


భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న మురగారెడ్డి

పుత్తూరు: నేటి సమాజంలో భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో సమస్యలను పరిష్కరించుకోవాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులరించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కిందన్నారు. లాహోర్ కుట్ర కేసుకు సంబంధించి భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసిందని తెలిపారు. నేడు రాజకీయ నేతల ముసుగులో ఉన్న దోపిడీదారులను ఎదుర్కోవాలంటే ఆయన పోరాట మార్గమే సరైందన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.వెంకటరత్నం, ఎం.అంకయ్య, ఏ.హరీష్, కె.హేమలత, వి.హేమవతి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.వెంకటేష్, విజయ్, సుబ్రమణ్యంపిళ్లై, పురుషోత్తం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత


సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం : మండల పరిధిలోని రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. శనివారం ఎస్‌కేఆర్ పురం పంచాయతీల్లో సేంద్రియ వ్యవసాయంలో సాగు చేస్తున్న పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగులో రైతులకు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి, వస్తుందన్నారు. రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకు పెరిగిపోతుండడమే కాక, ఉత్పత్తులు విషతుల్యం అయిపోతున్నాయని చెప్పారు. విత్తనశుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు గోవుపేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటకు వినియోగించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పొలంబడి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రసాయనిక మందుల వాడకం తగ్గించడం తదితర విషయాలపై తరవుగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, అనంతరం సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయల పంటలను క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు.

భారతీయ విజ్ఞానం వారసత్వ సంపద



సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: భారతీయ విజ్ఞానం వారసత్వ సంపద అని, దీనిని ప్రతి పౌరునికి అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం జాతీయ సంస్కృత వర్సిటీలో వారం రోజులుగా జరిగిన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్‌పై అధ్యాపకులు జరిగిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆధునిక కాలంలో భారతీయ విజ్ఞానాన్ని ఇండియన్ నాలెడ్జ్ సిస్టం ద్వారా యూజీసీ అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. జ్ఞానాన్ని భావిభారత పౌరులకు అందించి దేశ పురోభివృద్ధికి అధ్యాపకులు కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. అనంతరం వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పరంపర మూలాలు సంస్కృతం, వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. ఇందులోని జ్ఞానాన్ని భావిభారతానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ శివరామభట్, కె.సూర్యనారాయణ, పి.వెంకట్రావు, పలు విశ్వవిద్యాలయాల నుంచి శిక్షణకు విచ్చేసిన 125మంది అధ్యాపకులు పాల్గొన్నారు.